# సజీవ ప్రవంతి

ఊరికి మూడుమైళ్ళ దూరాన రాతి కొండల నడుమ ప్రవహిస్తోంది ఒక స్రవంతి—

ఆ కొండల మధ్య ఎక్కడో ఏదో ఊట వుండి ఉండాలి......ఆ స్రవంతి అన్ని కాలాలలోనూ ప్రవహిస్తూనే ఉంటుంది, ఆ కొండల మధ్య ప్రవహించి ప్రవహించి ఏ అడవులలోనో, అగాథాలలోనో అంతు తెలియకుండా లీనమయి పోతుంది...

ఆ ఊళ్ళో ఒకప్పుడు రెండు రాజ్యాలుండేవి ఆ రెండు రాజ్యాలనూ ఇద్దరు నిరంకుశులయిన ప్రభువులు పరిపాలిస్తుండేవారు...ఆ ఇద్దరినీ వారి వారి వందిమాగధులు 'చతుస్సముద్ర వేలావలయిత భూమండలాధీసు'లని కీర్తించేవారు.

ఆ కాలంలోనే కొండల మధ్య వ్యర్థంగా ప్రవహించే ఆ స్రవంతిని జనపదాలలోకి మళ్ళించాలని కొందరికి సంకల్పం

కలిగింది. ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి, ఒక రాజ్యంలో ఇలాంటి ప్రయత్నాలు ప్రారంభ మయ్యాయని రెండో రాజ్యానికి తెలియగానే ఆ రాజు మండి పడిపోయాడు. పొరుగు రాజ్యం తమకంటే ఆధిక్యం సంపాదించటమా? ఎంతమాత్రం వీల్లేదనుకున్నాడు. కత్తులు ఖణ ఖణ మ్రోగాయి, కుత్తుకలు తెగిపడ్డాయి.

ఆ ప్రవంతిని కొండల నడుమ నుండి తప్పించి జనుల మధ్యకు తెప్పించే నాధుడే లేకపోయాడు.

కాలం మారింది.

కానీ.

కథ మారలేదు......

ఆ ప్రవంతిని ఈ నాటికీ అలా కొండలమధ్య ప్రవహిస్తోనే ఉంది. సన్నగిల్లినా సజీవమైనది గనుక శక్తినంతా ఉపయోగించి ఆ శిలా హృదయాలను ఛేధించాలని ఆరాటపడుతోంది...... ఆ ఘోష ప్రతిరాత్రీ ఊరివారందరికి వినిపిస్తుంది......అలనాడు కుత్తుకలు తెగిపడ్డ సైనికుల ప్రేతాత్మల గోలగా ఆఘోషను వ్యాఖ్యానించారు కొందరు పెద్దలు, ఒక తరంనుండి మరొక తరం అదే కథ వినటానికి అలవాటు పడింది.

అలసులు, అసమర్థులు, భీరువులు అయిన జనం 'శ్రుతి వాక్యాలను' నమ్ముకున్నట్లు ఆత్మవంచన చేసుకుంటూ సజీవ ప్రవంతీ చైతన్య ధ్వానాలను చెవినపెట్టటం మానుకున్నారు

ఆ స్రవంతి గర్భంలో సుళ్ళు తిరుగుతోన్న ఆర్తిని అర్థంచేసుకో గలిగినవారు ఆ ఊళ్ళో ముగ్గురు వ్యక్తులున్నారు. ఒకడు స్వామి, ఆ ఊరి దేవాలయంలో పూజారి. మరొకడు లీడర్...... ఆ ఊరి వర్కర్స్ యూనియన్‌కి లీడర్‌గా ఉండమని ఒక పార్టీ పంపించింది అతణ్ణి ఆ ఊరికి. మూడోవాడు వెర్రిపంతులు. ఆ ఊరి మునిసిపల్ స్కూల్లో టీచర్.

ఆ ముగ్గురి స్వభావాలు వేరు.

సిద్ధాంతాలు వేరు.

దృక్పథాలు వేరు వేరు.

అయినా ఆ ముగ్గురూ స్పందించే హృదయమున్న వ్యక్తులు.

స్వార్థంతో మలినం కాని సంస్కారానికి వారసులు. అంచేత, ఆ ముగ్గురూ ప్రాణ మిత్రులు. ఆ ముగ్గురుకీ స్రవంతిని జనపదాలలోకి మళ్ళించాలనే ఆలోచన ఉంది.

స్వామి తన ఆలోచనను బయటపెట్టలేక పోయాడు. అతనికి భయం వేసింది.

లీడర్ ఏమీ మాట్లాడలేక పోయాడు. అతనికి సంకోచము కలిగింది!

వెర్రి పంతులుకి తానేం మాట్లాడినా ఏం ప్రయోజనం లేదని తెలుసు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూంటాడు ఎప్పుడూ......

గుళ్ళో దేవుడి పూజకు వేళయిందని లేచాడు స్వామి.

వర్కర్స్ని మీటింగ్ ఏర్పాటు చెయ్యాలని బయలు దేరాడు లీడర్.

తన కేమీ పనిలేదని అక్కడే ఆ పచ్చగడ్డిలో చేతులు తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు వెర్రిపంతులు......

"పంతులూ! చంటాడికి జ్వరంగా ఉంది. కాస్త ఆస్పత్రికి తీసికెళ్ళి మందేయించవూ?" అని అడిగింది ఒక గృహిణి.....

పడుకున్న చోటినుంచి లేచి అబ్బాయిని తన డొక్కు సైకిల్ మీద కూచోబెట్టుకుని ఆస్పత్రికి బయలుదేరాడు వెర్రి పంతులు.

అతన్ని చూసి జాలిగా నవ్వుకుంది ఆ గృహిణి "వెర్రి బాగులవాడు! అడిగిందే తడవుగా ఎవరినైనా ఆదుకుంటాడు!" అనుకుంది...... తన కొడుకు గురించిన బెంగ లేకుండా నిశ్చింతంగా వెళ్ళిపోయింది. వెర్రి పంతులుకి ఒక సారి అప్పజెప్పిన తరువాత తమ పిల్లల గురించి తాము ఆలోచించక్కర్లేదని ఊరి వారందరికీ తెలుసు.

ఊళ్ళో జనానికి వెర్రి పంతులంటే భయమూ, భక్తీ, గౌరవమూ ఏమీ లేవు. అతడి వెర్రి బాగులతనం చూసి జాలి పడుతుంటారు అందరూ.

స్వామి అంటే మాత్రం ఊళ్ళో చాలా మందికి భయ భక్తులున్నాయి. భక్తి కంటే భయమే ఎక్కువ. స్వామి గొప్ప భక్తుడనీ, నిగ్రహానుగ్రహ సమర్థుడనీ ఒక నమ్మకం

యేర్పడిపోయింది. ఎక్కడో ఉన్న గురుపీఠం నుంచి, గురువుగారు వచ్చి స్వామిని ప్రత్యేకం ఆశీర్వదించి వెళ్ళారు. స్వామి ప్రఖ్యాతి పెరగటానికి అదీ ఒక కారణం—

లీడర్ ని కూడా జనం గౌరవిస్తారు. అతనికి పార్టీలో ప్రముఖ వ్యక్తుల అండ దండలున్నాయి. వర్కర్స్ లో పలుకుబడి ఉంది. అలాంటి వ్యక్తిని నిర్లక్ష్యం చెయ్యటానికి వీల్లేదు.

"నాకు భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. దేదీప్యమానమయిన ఆ జ్ఞాన స్వరూపాన్ని నేను కళ్ళారా చూశాను" అంటాడు స్వామి భక్తి పారవశ్యంతో, చెమ్మగిల్లిన కళ్ళతో-

"అంతా హంబక్!" అంటాడు నిరసనగా లీడర్—

"నేను నమ్ముతాను" అంటాడు స్థిమితంగా వెర్రి పంతులు......

"నమ్ముతావా?" ఆశగా అడుగుతాడు స్వామి.

"నమ్మకపోవటానికి ఇందులో అంత విడ్డూరమేముందీ? మనమంతా యేముందో అది 'దర్శించటానికి' ప్రయత్నించం. మనం యేది చూడాలనుకుంటున్నామో అది చూస్తాం! విషయమేదో తెలుసుకోవాలని మనకుండదు. మనకు తెలిసిన దానితోనే సమస్తమూ అన్వయించుకోవటంతో సరిపెట్టుకుంటాం!"

"నీదంతా ఒక వెర్రిగోల......" అని విసుక్కుంటాడు స్వామి.

లీడర్ ఇది సహించడు.

"ఇలా మతం మత్తులో జనాన్ని పాడుచేస్తున్నారు. మాతో కలిసి ఈ పీడిత ప్రజానీకాన్ని ఉద్ధరించడానికి పాటు పడరాదూ!" అంటాడు లీడర్.

"మనుష్యుల మనసుల్లో మార్పు వస్తే, అందరూ మంచివాళ్ళే అయితే సమస్య లెందుకుంటాయి? భక్తి, పాప భీతి లేకుండా మనుష్యులు సక్రమ మార్గాల్లో నడవలేరు. మనసుల్లో మంచితనం లేనప్పుడు పైపై పరిస్థితుల్లో ఎన్ని మార్పులు వచ్చినా సమస్యలు పరిష్కారం కావు" అంటాడు స్వామి.

లీడర్ మహోద్రేకంతో "ధనిక వర్గం శ్రామికవర్గాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు నశించాలి— ఇది మా సిద్ధాంతం" అంటాడు......

"ఈ సిద్ధాంతం ఎంతో బాగుంది." అంటాడు వెర్రి పంతులు శాంతంగా.

"బాగుందా?" అంటాడు లీడర్ ఆనందంగా.

"సిద్ధాంతం సిద్ధాంతంగా ఎప్పుడూ బాగుంటుంది. కానీ మనం ప్రతి సిద్ధాంతాన్నీ ఆచరణలో మనకు అనుకూలంగా. మలచుకుంటాం...... అవక తవకలన్నిటికీ అదే కారణం" అంటాడు వెర్రి పంతులు.

"నీదంతా ఒక తిక్క మేళం" చిరాకు పడ్డాడు లీడర్......

వానలు లేవు, ఊళ్ళో పంటలు లేవు. సామాన్య జనం అల్లాడిపోతున్నారు. అక్కడక్కడ ఆకలి చావులు కూడా ఎదురవుతున్నాయి. వెర్రి పంతులు ఇది భరించలేక పోయాడు.

"స్వామీ! ఎలాగైనా ఆ స్రవంతిని జనపదాలలోకి మళ్ళించు, నిన్ను నమ్ముతాను, నీ దేవుణ్ణి నమ్ముతాను" అన్నాడు ఆరాటంతో—

వెల తెల పోయాడు స్వామి.

"ఎలా? అక్కడ దెయ్యాలున్నాయని జనం నమ్ముతున్నారు. ఈనాడు నేను దెయ్యాలు లేవంటే దేవుడు కూడా లేడనరూ?"

నిరాశతో లీడర్ దగ్గర కొచ్చాడు వెర్రి పంతులు......

"ఎలాగైనా ఆ స్రవంతిని జనపదాలలోకి మళ్ళించు నీ పార్టీ సిద్ధాంతాలు చాలా గొప్పవని అంగీకరిస్తాను." అన్నాడు ఆవేదనతో.

బిత్తర పోయాడు లీడర్.

"ఎలా? పార్టీ ఫండ్స్ పార్టీ అనుమతి లేకుండా ఖర్చు పెట్టడానికి వీల్లేదు. ప్రస్తుతం మా పార్టీ ప్రతి పక్షాన్ని పడ గొట్టే ప్రయత్నంలో ఉంది. పడగొట్టకపోతే పార్టీ వీక్ అయి పోతుంది. నేనేం చెయ్యగలనూ?"

జనాన్నే ప్రబోధించాలని చూశాడు వెర్రి పంతులు......

కొందరు నవ్వారు, కొందరు వెక్కిరించారు—మరి కొందరు విసుగెత్తి రాళ్ళు రువ్వారు—

ఊళ్ళో వర్షం కురిపించాలని భారీ ఎత్తున యజ్ఞం ప్రారంభించాడు స్వామి, చందాలు వసూలయ్యాయి, మహా వైభవంగా యజ్ఞం ముగిసింది. ఆ మరునాడే మబ్బులు క్రమ్మాయి, వర్షం కురిసింది. జనం స్వామిని దేవుడిలా ఊరేగించారు.

కరువు రోజులలో కూలీలకు వెనుకటి కూలి సరిపోదనీ కూలి పెంచమని సమ్మె ప్రారంభించమనీ కూలీలతో సమ్మెలు చేయించాడు లీడర్—పని ఆగిపోతుందని యాజమాన్యం భయపడింది, కూలి పెంచింది. జనం లీడర్‌కి బ్రహ్మరథం పట్టింది......

ఒక వర్షం పడింది. ఆగిపోయింది...... "దేవుడన్నారు—మహాత్మ్యమన్నారు? ఎక్కడుంది మహాత్మ్యం?" అనివిమర్శించాడు కొద్దిగా ఆలోచించగల ఒక కుటుంబీకుడు. స్వామికి కోపం వచ్చింది......

"దేవుణ్ణే విమర్శిస్తున్నాడు. రక్తం కక్కుకుచస్తాడు" అన్నాడు తనను తాను మరిచిన ఆవేశంలో. భరించలేక పోయాడు వెర్రిపంతులు.

"స్వామీ! ఏమిటిది? దేవుడే ఉంటే తనను కాదన్నంత మాత్రాన రక్తం కక్కుకుని చావమంటాడా? కేవలం నీ మాట నిజం కావటం కోసం ఒక అమాయకుడు బలి కావాలని కోరుకుంటున్నావా?" అన్నాడు.

పట్టుబడి పోయినట్లు బాధ పడ్డాడు స్వామి—

ఆ మరునాడే ఆ కుటుంబీకుడు రక్తం కక్కుకుని చచ్చిపోయాడు.

మతి పోయింది స్వామికి— ఆ కుటుంబీకుడి ఇంటికి వెళ్ళాడు. అతని భార్యాబిడ్డలు గోడుగోడున ఏడుస్తున్నారు.

"రాత్రి దొడ్లోకి వెళ్ళాడు. ఏదెయ్యం కనిపించిదో, కెవ్వున కేక పెట్టి రక్తం కక్కుకుని చచ్చిపోయాడు" ఏడుస్తూ వివరిస్తోంది భార్య......

స్వామి దొడ్లోకి వెళ్ళిచూశాడు దూరంగా చెట్టుకి ఏనాటిదో గాలిపటం చిక్కుకుపోయి ఏదో వింత ఆకారంలా కనిపిస్తోంది......

"......మనమంతా ఏముందో అది దర్శించటానికి ప్రయత్నించం. మనం ఏది చూడాలనుకుంటున్నామో అదే చూస్తాం. విషయమేదో తెలుసుకోవాలని ఉండదు. మనకు తెలిసిన దానితోనే సమస్తమూ అన్వయించుకోవటంతో సరిపెట్టుకుంటాం!" అన్న వెర్రి పంతులు మాటలు గుర్తొచ్చాయి. వికలమైన మనసుతో కోవెలకు తిరిగి వచ్చాడు తలెత్తి దైవాన్ని చూడాలంటే లజ్జ కలిగింది—

ఆ సాయంత్రమే ఆ ఇల్లాలు ఏడుస్తూ స్వామి దగ్గరకి వచ్చింది.

"స్వామీ! మా ఇంటాయన ఘోరపాపమే చేశాడు. ఇప్పటికయినా క్షమించి నా సంతానాన్నయినా కాపాడండి" అని స్వామి పాదాలమీద పడింది......

శిలలా స్థంబించి పోయిన స్వామి నోట అవునని కానీ, కాదని కానీ ఏ మాటా రాలేదు.

ఆ ఇల్లాలు మరింత ఏడుస్తూ "స్వామీ! మా పాపాన్ని క్షమించానంటే కాని మీ పాదాలను వదలను-" అంది......

స్వామి తెప్పరిల్లి "అవును! పాపం జరిగిపోయింది-ఈ రాత్రే ప్రాయశ్చిత్తం చేస్తాను" అన్నాడు.

కన్నీరు తుడుచుకుంటూ కదిలి పోయిందా ఇల్లాలు. కనీసం తన సంతానమైనా దక్కుతుంది అనే ఆశతో......

ఆ రాత్రి హంటర్ తీసుకుని దేవుడి ముందు నిలిచి తనను తాను చిత్రవధ చేసుకున్నాడు స్వామి. నిలవటానికి కూడా శక్తిలేని దశలో దేవుడి రాతి పాదాల ముందు కూలి పోయాడు.

ఎవరి పాపానికో ప్రాయశ్చిత్తం స్వామి చేసుకున్నాడన్న వార్త క్షణాలలో ఊళ్ళో వ్యాపించింది. స్వామిని చూడటానికి జనం విరగబడ్డారు. తలెత్తి ఆ జనాన్ని చూడలేని స్వామి తన ముఖాన్ని దేవుడి రాతి పాదాలలో దాచుకున్నాడు. గాయాలతో నిండిన ఆ ముఖం శిలా ఫలకాలకు ఒరుసుకుని భగ్గుమని మండుతోంటే ఆ మంటలో మనసులోని మంటను ఉపశమింప చేసుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

లీడర్ సమ్మెలు చేయించి కూలీల కూలి పెంచినట్లు ప్రతిపక్షం వారికి తెలిసింది. తమ పరపతి తగ్గిపోతూందని వాళ్ళు తల్లడిల్లి పోయారు. తమ వాలంటీర్లని పంపించారు. వాలంటీర్లు కూలీలను సమావేశపరిచారు. కూలి కొంచెమే పెరిగిందనీ, ఆ మాత్రం ఈ కరువు రోజులలో సరిపోదని ఉపన్యాసాలిచ్చారు. మేనేజిమెంట్‌తో మాట్లాడి తమ పార్టీ పలుకుబడి ఉపయోగించి, కూలి మరికాస్త పెంచేలా చేశారు......

లీడర్‌కి పార్టీనాయకుల దగ్గర నుండి ఆదేశాలు వచ్చాయి. ప్రతి పక్షంవాళ్ళు కూలీలలో పరపతి పెంచుకుంటున్నారు. దానికి విరుదుగా, వెంటనే కూలీలతో సమ్మె చేయించు—' అని......

'ఇది న్యాయమేనా' అని లీడర్‌కి ఒక్క క్షణం సందేహం కలిగింది. కానీ పార్టీ ఆదేశాలు పాటించక తప్పదు.

"కూలీల శ్రమ ఫలితంగా యాజమాన్యం బాగా లాభాలు సంపాదించుకుంది. కూలీలకు బోనసులు రావాలి" అని రెచ్చగొట్టి సమ్మె ప్రారంభింప చేశాడు.

యాజమాన్యం ఈసారి లొంగలేదు. అసలే కరువు రోజులు. దానికి తోడు కూలి డబ్బులు దొరకటంలేదు కూలిజనం అల్లాడిపోయారు.

"నువ్వు నిజంగా శ్రామిక జనాభ్యుదయానికి చేస్తూన్న కృషేనా ఇదంతా?" అని అడిగాడు వెర్రి పంతులు—

సమాధానం ఇయ్యగలిగే శక్తి లేకపోయింది లీడర్ కి—

కూలి జనంలో అయిదారుగురు పెద్దలున్నారు. సాధారణంగా ఆ పెద్దలమాట కూలీలందరూ వింటారు. ఆ పెద్దలను సంప్రదింపులకు తీసుకురమ్మని యాజమాన్యం తమ మనిషిని పంపింది. ఆ మనిషి జీప్ లో వచ్చాడు. కూలి జనం పొంగి పోయారు. లీడర్ జయజయ నినాదాలు చేశాడు. పెద్దలు జీప్ లో బయలు దేరారు. చీకటి పడే సమయానికి జీప్ ఒక హోటల్ పాకముందు ఆగింది. బస్ రూట్లలో కేవలం బస్ ప్రయాణీకుల కోసం అలాంటి పాకల్లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లమీద హోటల్స్ నడుపు తుండటం పరిపాటే!

అందరూ దిగి పాకలోకి వెళ్ళారు. అక్కడ కాఫీ, టీ, ఫలహారాలే కాక కల్లు కుండలు కూడా ఉన్నాయి. యాజమాన్యం పంపిన మనిషి పెద్దలకు బాగా కల్లు పోయించాడు వాళ్ళు వళ్ళెరక్కుండా త్రాగారు. ఆ తరువాత యాజమాన్యం వారి మనిషి, ఆ పాకలో హోటల్ నడుపుతున్న మనుష్యులూ సినిమాకు వెళ్ళారు. పెద్దలు త్రాగుడు మత్తులో "మేం సినిమాకు రాము" అన్నారు. సరిగ్గా ఆ సమయంలో హోటల్ నడుస్తోన్న ఆ పాక తగలబడి పోయింది. పెద్దలందరూ సజీవంగా దహనమయి పెద్దలలో కలిసిపోయారు.....

ప్రమాదం జరిగి పోయిందని సంతాపం ప్రకటించింది యాజమాన్యం......

3)

పాకలోకి కల్లు ఎందుకు తెప్పించారు? యాజమాన్యం వారి మనిషితోపాటు హోటల్ నడిపే వాళ్ళుకూడా సినిమాకు ఎందుకు వెళ్ళారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు లేవు, అడిగే నాథుడు లేడు—

“మీ కూలీలపట్ల మాకే విధమయిన వైషమ్యమూ లేదు. ముందు వెంటనే పనిలో చేరిపోతే, ఆ తరువాత బోనసు విషయం ఆలోచిస్తాం......” అని ప్రకటించింది యాజమాన్యం...జరిగిన సంఘటనతో హడలిపోయిన కూలిజనం యాజమాన్యం మంచి మాటలకు లొంగిపోయి పనిలో చేరిపోయారు.

అన్యాయంగా అగ్నికి అహుతయిన వారి కుటుంబాల గోడు చూడలేకపోయాడు లీడర్......తన కున్నదంతా ఊడ్చి ఆ కుటుంబాలను ఆదుకున్నాడు. వారిలో ఒకడుగా కలిసిపోయాడు......కృతజ్ఞతతో కరిగిపోయిన ఆ కుటుంబాలు “ధర్మ ప్రభువు.” అన్నాయి......

భరింపరాని ఆవేదనతో “మీ కోసం నేను ఏం చెయ్యమన్నా చేస్తాను. నన్ను “ధర్మప్రభువు” అని మాత్రం అనకండి” అన్నాడు లీడర్. తెల్లబోయిన కూలిజనం మరిన్ని దణ్ణాలు పెట్టబోతుంటే అక్కడి నుంచి పారిపోయాడు లీడర్......

గురు పీఠంనుంచి గురువుగారు వచ్చారు స్వామిని ఆశీర్వదించడానికి......ఊరంతా ఉత్సవాలే! గురువుగారి ఉప

న్యాసాలు చాలా గొప్పగా ఉన్నాయి. వారి తాత్విక జ్ఞానానికి స్వామి ఆశ్చర్యపోయాడు. ఆ ముఖంలో తాండవించే బ్రహ్మవర్చస్సుకి ముగ్ధుడయి పోయాడు......

ఆ రోజు ఎప్పటిలా ఊరికి దూరంగా ఉన్న కొండల వరుసల దగ్గరకి బయలుదేరాడు స్వామి, దారిలో పొదల మాటున అలికిడై తే, ఆగి చూసి నివ్వెర పోయాడు. గురువు గారు ఒక కూలి పడుచుతో......

చూడలేక గిరుక్కున వెను తిరిగిన స్వామి మరో సారి నిర్ఘాంత పోయాడు......తన ఎదురుగా గొడ్లను కాచుకునే గోపన్న...... అతడు కూడా ఆ దృశ్యాన్ని చూశాడన్న మాట! ఇద్దరూ ఒకరి ముఖం మరొకరు చూసుకోలేనట్లు చెరొక వైపుకీ చీలిపోయారు......

ఇన్నాళ్ళూ ఆ గురువుగారి ముఖంలో కనిపించిన బ్రహ్మ వర్చస్సంతా ఏమయిందీ?

"మనం చూడాలనుకున్నదే చూస్తాం......" వెర్రి పంతులు మాటలు......

గురువుగారి ముందు కూచుని ఆ ఉపన్యాసాలు వినగలిగే శక్తి నశించి పోయింది స్వామిలో......

పూజా సమయంలో గురువుగారి శిష్యులలో ఒకడి దేవుడు పూనాడు......

"ఈ ఊళ్ళో కరువు తొలగాలంటే నాకు నరబలి కావాలి. గొడ్లను కాచుకునే గోపన్నను బలి ఇవ్వండి...... లేకపోతే ఊరినే నాశనం చేస్తాను......" అన్నాడు.

హడిలిపోయాడు స్వామి అతనికి అసలు విషయం అర్థమయింది. గురువుగారిని కాపు పడుచుతో గోపన్న చూసినట్లు గురువుగారికి తెలిసిపోయింది. అందుకే గోపన్నను బలి కోరుతున్నారు!

భక్తులైన జనం వెర్రెత్తినట్లు గోపన్నమీద విరుచుకుపడి గుడికి ఈడ్చుకు రాక తప్పదు......

ఉరుకులతో పరుగులతో గోపన్నను చేరుకుని అప్పటికప్పుడు గోపన్నను పొరుగూరు పంపేశాడు స్వామి......

గురువుగారు ఉగ్రులై పోయాడు......

“దేవుడికి నరబలి కావాలి. ఆ నరబలి సమర్పించే బాధ్యత స్వామిదే! లేకపోతే దేవుడు సర్వనాశనం చేసి తీరతాడు.”

అని భగవదాదేశాన్ని ప్రకటించారు......

జనప్రవాహపు వెర్రి ఉద్రేకం స్వామివైపు తిరిగింది......

“స్వాములోరూ! రెండు మూడు రోజుల్లో దేవుడికి ఏదో నరబలి చూడు!” అని స్వామిని హెచ్చరించారు ఊరి పెద్దలు. ఊరిని కాపాడటానికి......

శరభయ్య తనవి కాని యిళ్ళ స్థలాలు కూలి జనానికి అమ్మి డబ్బు పోగుచేసుకున్నాడు. తీరా అసలు యజమాని వచ్చి ఆ స్థలాలు తన వన్నాడు. గుడిసెలు వేసుకున్న కూలి జనాన్ని తరిమేశాడు. కూలి జనం శరభయ్యను అడిగారు. శరభయ్య తన కేం తెలియదు పొమ్మన్నాడు......

ఈ సంగతి తెలిసి లీడర్ నివ్వెర పోయాడు. ఎందుకంటే శరభయ్య పార్టీలో మనిషే! కూలి జనాన్ని ప్రబోధిస్తూ అతడు చాలా ఉపన్యాసాలిచ్చాడు......

ఈ సంగతి పార్టీ పెద్దలకు తెలియ చేశాడు లీడర్......

"శరభయ్య బాగా పలుకుబడి ఉన్న మనిషి, మన పార్టీకి మంచి అండ. అలాంటి వాడితో విరోధం వద్దు. కూలి జనానికి ఎంతో కొంత ముట్టజెప్పి సర్దుబాటు చెయ్యి" అని సమాధానం వచ్చింది.

మతిపోయినట్లయింది లీడర్‌కి.

"సిద్ధాంతం సిద్ధాంతంలా ఎప్పుడూ మంచిదే! ఆచరణలో మనకు అనుకూలంగా మలచుకోవటానికి ప్రయత్నిస్తాం — అప్పుడే అవకతవకలన్నీ" అనే వెర్రి పంతులు మాటలు గుర్తుకొచ్చాయి.

పార్టీ నుండి మరొక ఆదేశం వచ్చింది లీడర్‌కి.

"ఆ ఊళ్ళో ఇద్దరు భూస్వాములకి మన పార్టీ రహస్యాలు చాలా తెలిశాయి. అవి బయట పడటానికి వీలు లేదు. మందు గుండు పంపిస్తున్నాం. ఆ రెండు భవనాలూ పేల్చేయ్యండి" అని.

ఆ భూస్వాముల భవనాల పక్కనే సామాన్యుల కుటుంబాలు కూడా ఉన్నాయి. మందుగుండు ఉపయోగించి

ఆ భవనాలు నాశనం చేస్తే ఈ సామాన్య కుటుంబాలు కూడా నాశనం కాక తప్పదు. ఇంత మారణహోమం జరగ వలసిందేనా?

"నావల్ల కాదు. కొందరు దుర్మార్గులను నాశనం చెయ్యాలని మరి కొందరు మంచివాళ్ళను కూడా హతమార్చ లేను. పోనీ, నన్నే హతమారిపోనీ!" అన్నాడు లీడరు.

"నావల్ల కాదు. నేను నరబలి ఇయ్యలేను. నేనే బలి అయిపోతాను" అన్నాడు స్వామి.

ఇద్దరి మాటలూ విన్న వెర్రి పంతులు మహోత్సాహంతో లేచాడు.

"ఆ మందుగుండుతో దుష్ట శక్తుల్ని నేను నాశనం చేస్తాను" అన్నాడు.

"దేవుడికి నరబలి నేను సమర్పిస్తాను" అన్నాడు.

అప్పుడే ఊరంతా చాటించాడు. "రేపటికల్లా దుష్ట శక్తులు నశిస్తాయి, దేవుడికి నరబలి దొరుకుతుంది, ఊరికి మేలు జరుగుతుంది" అని.

ఊరంతా ఉత్సుకతతో ఎదురు చూస్తుండగా, తూరుపు తెలతెల వారబోయే ముందు మందుగుండు పేలిన శబ్దం దిక్కులు మార్మోగుతూ వినిపించింది.

జనం విభ్రాంతితో చూస్తూ ఉండగా శిలాశకలాలను దొర్లించుకుంటూ సజీవ స్రవంతి ఊరి పంట పొలాల మధ్యకు ప్రవహించింది! చెల్లా చెదురైన కొండల మధ్య

తనను తాను బలిచేసుకున్న వెర్రి పంతులు చిరునవ్వులు చిందిస్తూ పడి ఉన్నాడు......

తమ మిత్రుణ్ణి ఆ దశలో చూసుకున్నారు మిగిలిన మిత్రులిద్దరూ......

"భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూశాననుకున్నాను చాలాసార్లు! పొరపాటు! ఇప్పుడే, మొదటిసారిగా చూస్తున్నాను" అన్నాడు స్వామి......

"ఏ సిద్ధాంతాలకూ అందని సదాశయమేదో ఇప్పుడే తెలుసుకోగలిగాను—" అన్నాడు లీడర్......

వెర్రి పంతులు రక్తాశ్రువులను రంగరించుకొన్న సజీవ ప్రవంతిలోని చైతన్య జీవనం నవారుణ కాంతులలో వింత వెలుగులు విరజిమ్మింది. జనపదాలలోకి జ్ఞానప్రద వాహినిగా ప్రవహించింది.